

పతాకస్థాయికి సమ్మె

అంగన్వాడీలు తగ్గేదే లే...




- సమ్మె పై ప్రభుత్వం ఉక్కుపాదం
- వెనక్కి తగ్గదేలేదంటున్న అంగన్వాడీలు
- సచివాలయ సిబ్బందితో సెంటర్లు తెరిచే యత్నం, ఫోనుల్లో బెదిరింపులు
- తాళం పగలకొట్టి కొత్తవి వేస్తున్న వైనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

న్యాయమైన డిమాండ్ సాధన కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం విఫలయత్నం చేస్తోంది. సంఘమిత్రలు (వీవోఏ) ద్వారా సెంటర్లను నడపాలని ప్రయత్నించినా అందుకు వివోఏలు అంగీకరించకపోవడతో రాష్ట్ర ప్రభుత్వానికి నమ్మిన బంటుల్లా పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది రంగంలోకి దింపింది. జిల్లాలో అక్కడక్కడా తహశీల్దార్లు, ఎంపిడిఒలు సచివాలయ సిబ్బందిని వెంటబెట్టుకొని బలవంతంగా అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగులగొట్టి సెంటర్లలోకి ప్రవేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లోకి నాలుగు గంటల తరువాత ప్రవేశించడం, తాళాలు బద్దలు కొట్టడం చట్టవిర్ధుమంటూ అంగన్వాడీ యూనియన్ నేతలు, అంగన్వాడీలు, లబ్ధిదార్లు అడ్డుకొనే ప్రయత్నం చేసినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదు. ఇదే తీరుగా ప్రభుత్వం చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నేతలు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చట్టాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే చట్టవ్యతిరేకంగా సమ్మెలో ఉన్న అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోవగా పోటీగా సచివాలయ సిబ్బంది ద్వారా సెంటర్లను బలవంతంగా తెరవడం, ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తించడం పట్ల జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడురోజుల పాటు జిల్లాలోని 11ప్రాజెక్టుల్లో ప్రశాంతంగా సాగిన అంగన్వాడీల సమ్మె ప్రభుత్వం చట్టవ్యతిరేకంగా సెంటర్లను సచివాలయ సిబ్బంది ద్వారా బలవంతంగా తెరిపించే ప్రయత్నం చేయడంతో ఉధృతంగా మారింది. ప్రభుత్వ తీరుపై అంగన్వాడీలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్బాంధాలతో అంగన్వాడీల పోరాటాన్ని అడ్డుకోలేరని అంగన్వాడీల పోరాటం ఏపాటిదో గతంలో అనేక సందర్భాల్లో నాటి ప్రభుత్వాలకు చాటిచెప్పిన అంగన్వాడీలు తాటాకు చప్పులకు భయపడే ప్రసక్తి లేదని, వెనక్కి తగ్గేదేలేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సాగుతున్న సమ్మెను విచ్ఛినం చేసేలా ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు. అంగన్వాడీల మూడోరోజు సమ్మెలో జిల్లాలోని చిత్తూరు, జీడినెల్లూరు, ఐరాల, బంగారుపాళ్యం, యాదమరి, కార్వేటినగరం, నగరి, కుప్పం, శాంతిపురం, వీకోట, పుంగనూరు, పలమనేరుతో పాటు ఇతర ప్రాంతాల్లో వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీలు, హెల్పర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కుప్పంలో మానవహారం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి విన్నతి పత్రం అందించారు. అంగన్వాడీల పోరాటానికి వివిధ రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు.



పలమనేరులో అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగులగొడుతున్న సచివాలయ సిబ్బంది

యాదమరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు తమ హక్కుల సాధనకై సమ్మెను ఉధతం చేస్తున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం తన నిరంకుశ వైఖరిని చాటుకుంటున్నది, సచివాలయ ఉద్యోగులు దౌర్జన్యంగా అంగన్వాడీ సెంటర్లు తాళాలు ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్‌కు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. దీంతో మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు గ్రామపంచాయతీ కార్యదర్శులు తాళాలు పగలగొడుతూ మరో తాళం వేస్తున్నారు.

బంగారుపాళ్యం: అంగన్వాడీల సమ్మె మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షులు వరలక్ష్మి మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అంగన్వాడీలపై రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. వీరికి తెలుగుదేశం మండల ఉపాధ్యక్షులు కమలనాథ్‌రెడ్డి, కోదండ యాదవ్, వంశీచౌదరి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలు రత్నకుమారి, భారతి, శశికళ, లక్ష్మీ, రాధిక, సరస్వతి పాల్గొన్నారు.

కుప్పం: పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ప్రారంభించిన నిరవధిక సమ్మె గురువారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్వాడీలు ఐసిడిఎస్ కార్యాలయం నుండి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి తమ సమస్యలు పరిష్కరిం చాలంటూ వినతిపత్రాన్ని సమర్పించి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు.



యాదమరిలో తాళాలు పగులగొడుతున్న సచివాలయ సిబ్బంది

పుంగనూరు: అంగన్వాడీలు చేస్తున్న న్యాయబద్ధమైన సమ్మెకు పుంగనూరు తెలుగుదేశం, జనసేన పార్టీలు పూర్తి మద్దతును తెలియజేస్తూ సమ్మెలో పాల్గొన్నారు. రాంపల్లి సమీపంలో ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల యూనియన్ ఆధ్వర్యంలో మూడవరోజు సమ్మె గురువారం నిర్వహించారు. అంగన్వాడీలు ప్రేమ్ కుమారి, పద్మ, వీణ, శోభ, టిడిపి రూరల్ పార్టీ అధ్యక్షులు గంగసాని మాధవరెడ్డి, నాయకులు సివిరెడ్డి, ఆసూరి బాలాజీ, చిన్న మోహన, ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గంగులప్ప, జనసేన నాయకులు చిన్న రాయల్, పగడాల రమణ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాలకు చెందిన గంగాధర నెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది సమ్మె లో పాల్గొన్నారు. అదేవిధంగా అంగన్వాడీల సమ్మెకు టిడిపి నేతలు ఎర్రగుంట్ల క్రిష్టమనాయుడు, శ్రీధర్‌యాదవ్, వెంకటేష్, స్వామిదాస్, దేవసుందరం, జ్యోతి యాదవ్, కామసాని కోదండరెడ్డి, కార్జాల అరుణ, తలారి రెడ్డెప్ప, రాంబాబు రెడ్డి, చెంగ్రాయ యాదవ్ పాల్గొని మద్దతు తెలిపారు.

నగరి: అంగన్వాడీల సమ్మె గురువారం మూడవరోజు కొనసాగుతుంది. నగరి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు బైటాయించి తమ న్యాయమైన కోర్కెలు కోసం నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారికి వ్యతిరేకంగా అంగన్వాడీ సెంటర్లను బలవంతంగా తెరవడం మానుకోవాలని, తెరిస్తే అడ్డుకుంటామని యూనియన్ నాయకులు ధనకోటి మునెమ్మ, ఏఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య హెచ్చరించారు. అంగన్వాడీలు విజయ, ధనకోటి, వరలక్ష్మీ, మునెమ్మ, కస్తూరి, శాంతి, భవాని పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనే లక్ష్యం..

- ఎస్.షకిలా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి



న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. మా సమ్మె చట్టబద్ధమైంది. కార్మిక చట్టం ప్రకారం 14 రోజుల ముందు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చాము. రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వపెద్దలతో పలుమార్లు చర్చలు జరిపింది. ఏ సమస్యపై ప్రభుత్వం నుండీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సమ్మెకు పూనుకోవాల్సి వచ్చింది. బలవంతంగా సెంటర్లను సచివాలయ సిబ్బంది ద్వారా తెరిపించడం చట్టవిరుద్ధం చట్టాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం చట్టవ్యతిరేక కార్యక్రమాలను పాల్పడం దుర్మార్గం.

ప్రభుత్వ తీరు అత్యంత దుర్మార్గం


- లలిత, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



అంగన్వాడీల సమ్మె పట్ల ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాల అమలు, పదవీవిరమణ కాలం పెంపు ఇలా న్యాయమైన డిమాండ్స్ ప్రభుత్వ ముందు పెట్టడం జరిగింది. అధికారంలోకి రాక ముందు జగన్‌మోహ్మన్‌రెడ్డి అంగన్‌వాడీలకు పక్క రాష్ట్రాల కంటే అదనంగా జీతం ఇస్తామన్నారు. బడ్జెట్ సాకుతో అంగన్వాడీల జీతాల పెంపు చేయపోక సంక్షేమపథకాలు అమలు కావటంలేదు... గౌరవవేతనం తీసుకుంటున్న అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

జీతాలు పెంచమంటే పోటీ వర్కర్లను తీసుకొస్తారా..

- వాడ గంగరాజు, యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు



కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే సచివాలయ సిబ్బందిని పోటీ వర్కర్లుగా తీసుకొచ్చి అంగన్వాడీల సమ్మెను విచ్ఛినం చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది. గతంలో అనేక ప్రభుత్వాలకు అంగన్వాడీలు పోరాటాల ద్వారా గుణపాఠం చెప్పిన అనుభవాలున్నాయి. ప్రభుత్వ జగన్ ప్రభుత్వం అంగన్వాడీల పోరాటాలను తక్కువ అంచనా వేస్తోంది.



కుప్పంలో..



జిడినెల్లూరులో..



చిత్తూరులో..



శాంతిపురంలో మోకాళ్లపై నిలబడి నిరసన



బంగారుపాళ్యంలో..



కార్వేటి నగరంలో..



పుంగనూరులో టిడిపి, జనసేన మద్దతు

కనీస వేతనాల్విండి

కలెక్టరేట్ ఎదుట ఆశాల 36 గంటల ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ముఖ్యమంత్రి జగన్ మోహ్మన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పెంచిన జీతం ఇవ్వాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశాలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆశాల జీతాలు పెంచుతున్నట్లు ప్రకటించినా నేటి వరకు పెంచిన జీతం అమలు కావడం లేదని ఇచ్చే జీతం ఏమాత్రం సరిపోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోరాటం చేయాల్సి వస్తోందని, ఇచ్చే జీతంలో సగం టిఏ, డిఏలకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో అనర్హులుగా ప్రకటిస్తున్న ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 36 గంటల ఆందోళన ప్రారంభమైంది. ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ, అధ్యక్షురాలు కష్ణవేణి, కోశాధికారి పద్మ, సావిత్రి, వనజ, రామలతో బాటు అన్ని మండలాల నుంచి ఆశా వర్కర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.చైతన్య, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, మిన్నల్ జ్యోతి ధర్నాలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాల దగ్గరవెట్టి చాకిరిని చేయించుకుంటూ కనీసవేతనాలు ఇవ్వకుండా పనిభారం పెంచి అష్టకష్టాలు పెడుతున్నదని విమర్శించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి జగన్ ప్రభుత్వం నిరాకరిస్తున్నదని ఆరోపించారు. ఉద్యోగ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆదుకోండయ్యా..

కేంద్రబృందాన్ని అర్థించిన రైతాంగం..

రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తామన్న కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, రామకుప్పం:

క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అందిన అభ్యర్థనలను ఉన్నతాధికారులకు నివేదిక పంపి పరిష్కరించేందుకు కషి చేస్తామని మినిస్ట్రీయల్ సెంట్రల్ టీం (ఐఎంసిటి) సభ్యులు కష్ణ, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ పి.దేవేంద్రరావు తెలిపారు. గురువారం జిల్లాలోని పలమనేరు మండలంలోని గుండ్లపల్లి, శ్రీరంగరాజపురం గ్రామాలలో వేరుశెనగ పంట పొలాలలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలసి ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసిటి) పర్యటించారు. ఈ పర్యటనలో బంద సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ అనిమల్ హస్బెండరీ మరియు డైరీయింగ్ అంజు బసెరా, ఎంఎన్‌సిఎఫ్‌సి అసిస్టెంట్ డైరెక్టర్ డా.ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ జిల్లాలో పలమనేరు, రామకుప్పం, గంగవరం, రొంపిచర్ల మండలాలను కేంద్ర ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందని తెలిపారు. కరువు మండలాలలో రైతులు పడుతున్న ఇబ్బందులను అంచనా వేయడానికి కేంద్ర బందం జిల్లాకు రావడం జరిగిందన్నారు. పలమనేరు, రామకుప్పం మండలాలలో నీటిలభ్యత తక్కువగా ఉందని, ఈ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలు పండిస్తున్నారని, వర్షాభావ పరిస్థితులు, అకాల వర్షాల కారణంగా రైతులు పంట నష్టపోవడం జరుగుతున్నదని, శాశ్వత నీటివసతి లేదని కేంద్ర బందానికి జేసి వివరించారు. జిల్లాలో ఖరీఫ్ 2023కు 51,266 హెక్టార్ల వేరుశనగ పంట లక్ష్యం కాగా వర్షాభావ పరిస్థితుల కారణంగా 15,038 హెక్టార్లు పంట మాత్రమే సాగు చేయడమైనదని తెలిపారు.



రామకుప్పం మండలంలో నష్టపోయిన వేరుశనగ పంటలను కేంద్ర బృందానికి చూపుతున్న రైతులు

పలమనేరు మండలం గుండ్లపల్లిలో గల వేరుశెనగపంట పొలంలో రైతులతో కరువు బృందం ముఖాముఖి నిర్వహించారు. రైతులు కరువు బందానికి వివరిస్తూ... కరువు కోరల్లో చిక్కున్న రైతాంగాన్ని ఆదుకోవాలని ముక్తకంఠంతో అర్థించారు. ఒక ఎకరా వేరుశెనగ పంటకు దాదాపు రూ.30,000 నుండి రూ.35,000 ఖర్చు అవుతున్నదని, పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్నామని, ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేయాలని కోరారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకోపోవడంతో చెరువులలో నీటి లభ్యత లేదని, స్వంత ట్రాక్టర్లు లేవని, నాణ్యమైన విత్తనాలు లభించడం లేదని, పశు సంపదపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు మేలు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, ఉపాధి పనిదినాలను పెంచాలని కోరారు. ఏనుగుల దాడి వలన పంట నష్టపోతున్నామని, సోలార్ లైట్‌లు అమర్చి ఏనుగుల భారినుండి పంటను రక్షించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రైతులు కేంద్ర బందం ముందు విన్నవించారు ఐఎంసిటి సభ్యులు, కష్ణ, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ పి.దేవేంద్ర రావు మాట్లాడుతూ కరువు మండలాలలో నీటి లభ్యత తక్కువ ఉన్నదని, డ్రిప్ ఇరిగేషన్, మైక్రోఇరిగేషన్ ద్వారా పంట పండిస్తున్నారని, ఈసంవత్సరం కరువు భారినపడి రైతులు నష్టపోవడం జరిగిందన్నారు. వేరుశెనగపంట కొరకు రైతులు ఎక్కువ పెట్టుబడులు పెట్టడం, పంటకు సరియైన గిట్టుబాటు ధరలేవని రైతులు తెలిపారన్నారు. ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, ఉపాధి పనిదినాలను 100 నుండి 150 రోజులు పెంచాలని రైతులు బందానికి నివేదించారన్నారు. ఈ విషయాలను క్రోడీకరించి సంక్షిప్త నివేదికను ప్రభుత్వానికి సమర్పించి రానున్న ఎండాకాలంలో కరువు నుండి రైతాంగాన్ని కాపాడేందుకు కషి చేస్తామని అన్నారు. అనంతరం శ్రీరంగరాజపురంలో నష్టపోయిన వేరుశనగ పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ పర్యటనలో డ్వామా పిడి గంగాభవాని, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకష్ణ, జిల్లా ఉద్యాన శాఖఅధికారి మురళీధర్ రెడ్డి జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ప్రభాకర్, జిల్లా పట్టుపరిశ్రమ అధికారి శోభారాణి, పలమనేరు ఆర్డీఓ మనోజ్ కుమార్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న, జిల్లా భూగర్భ జలవనరుల శాఖాధికారి గోవర్ధన్ రెడ్డి, పలమనేరు రూరల్ తహశీల్దార్ కుప్పుస్వామి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

కలెక్టరేట్ ధర్నాలో సిపిఐ, సిపిఎం, రైతు సంఘం, టిడిపి నాయకులు



రాష్ట్రంలో ఒకవైపు కరవు, మరోవైపు తుపాను తాకిడితో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం తీవ్రవైఫల్యం చెందిందని సిపిఐ, సిపిఎం, ఏపీ రైతుసంఘం నేతలు ధ్వజమెత్తారు. తుపాను బాధితులను ఆదుకోవాలంటూ కలెక్టరేట్ల వద్ద గురువారం నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్ధన్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరువు, తుపాను వంటి ప్రకతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధిత రైతాంగాన్ని, ప్రజలను ఆదుకోవడంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందుతోందని విమర్శించారు. 500 మండలాల్లో కరువు ఉంటే 103 లోపు ప్రకటించడం దారుణమన్నారు. తుపాను వల్ల 13జిల్లాలో వరి, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయని, కోట్లాది రూపాయలు రైతాంగం నష్టపోతే ప్రభుత్వం చిత్తశుద్ధితో తగుచర్యలు చేపట్టక పోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. కేంద్ర బందాలను సత్వరం తీసుకొచ్చి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి ఉండగా ఈ కార్యక్రమం కూడా తూతూమంత్రంగా నిర్వహిస్తూ రైతన్న నోట్లో మట్టి కొట్టుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి తడిసిన ధాన్యం కూడా కొనమంటే మిల్లర్లు ముందుకు రావడం లేదంటే ప్రభుత్వానికి ఏమాత్రం పట్టు ఉందో తెలుస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజానీకం ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యలు పరిష్కరించకుండా 'ఆటాడుకుందాం, వైనీడ్స్ జగన్' వంటి వథా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమయం డబ్బు వృధా చేయడం అవసరమా అని సూటిగా ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మణి, విజయ గౌరి, దాసరి చంద్ర, జమిలబీ, కుమారి, కోమల, బాలాజీ, రఘు, అనిత, టిడిపి ఎస్సీసెల్ జిల్లా నాయకులు కొత్తపల్లి శంకర్, భువనేశ్వరి, చాంద్ బాష తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ విలువకన్నా తక్కువకే అందజేత..

భూమి పూజ కార్యక్రమంలో మంత్రి ఆర్కేరోజా

ఉద్యోగులకు, మధ్యతరగతి కుటుంబాలకు వరం

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్



ప్రజాశక్తి- నగరి: మధ్యతరగతి కుటుంబాలకు, ఉద్యోగులకు కూడా సొంతింటి కలను సాకారం చేయడానికి మార్కెట్ విలువ కంటే తక్కువకే ప్లాట్లు అందించేందుకు జగనన్న సర్కార్ తీసుకున్న నిర్ణయమే జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ అని మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం కీళపట్టు శివారుల్లో చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారిని ఆనుకొని ఏర్పాటుచేయనున్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కు ఆమె భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలన్న సంకల్పంతో ఏకంగా 31లక్షల ఇళ్లపట్టాలు పేదవాళ్లకు ఇప్పటికే పంపిణీ చేశామని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం మధ్యతరగతి కుటుంబాలకు, ఉద్యోగులకు సొంతింటి కలను సాకారం చేయడానికి జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తుడావారే ప్లాటను అభివద్ధి చేసి న్యాయపరంగా ఎలాంటి చిక్కులు లేకుండా సులభమైన రీతిలో బ్యాంకు రుణాలు పొంది నిర్మాణాలు చేపట్టుకునేలా ప్లాట్లు అందించడం జరుగుతుందన్నారు. 18లక్షల వరకూ వార్షిక ఆదాయం ఉన్న వారు జగనన్న టౌన్‌షిప్‌లో ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఏడాది కాలంలో నాలుగు వాయిదాల్లో చెల్లింపులు చేయవచ్చున్నారు. ప్లాట్ల నిర్ణీత విలువలో మొదట 10 శాతం చెల్లించి అగ్రిమెంటు వేసుకోవాలని తరువాత నెలరోజుల్లో 30 శాతం, ఆరునెలల్లో 30శాతం, ఏడాది లోపు మిగిలిన 30 శాతం చెల్లిచాలన్నారు. చెల్లింపులు పూర్తికాగానే డెవలప్‌చేసిన ప్లాట్లను రిజిష్టరు చేసి చేతికి అందిస్తారన్నారు. పీఆర్సీ సందర్భంగా ఉద్యోగులకు మాట ఇచ్చిన మేరకు 10 శాతం ప్లాట్లను ఉద్యోగులకు రిజిర్వు చేస్తూ 20శాతం రిబేటుతో అందిస్తామన్నారు. ఆక్షన్‌లో పాల్గొనే పెన్షనర్లకు 5 శాతం రిజిర్వు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు తుడా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌ద్వారా చేసుకోవాలన్నారు. పూర్తిపారదర్శకతతో కులం, మతం, ప్రాంతం, పార్టీలతో సంబంధం లేకుండా ప్లాట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. లేఅవుట్ స్థలంలో 50శాతం స్థలం ఉమ్మడి అవసరాలైన పార్కులు, ప్లేగ్రౌండ్స్, స్కూళ్లు తదితర అవసరాలకు కేటాయించడం జరుగుతుందన్నారు. 40 నుంచి 60 అడుగుల వెడల్పు గల రోడ్లతో మౌలిక వసతులతో ప్లాటు అందిస్తామని ఒకే విడతలో పూర్తి మొత్తం చెల్లించే వారికి 10 శాతం తగ్గింపు కూడా ఉంటుందన్నారు. తుడా డీఈ రవీంద్ర, ఏఈ విజయశేఖర్, వర్క్ఇన్‌స్పెక్టర్లు రాజేష్, నీలకంఠం, కౌన్సిలర్ అణ్ణెమ్మ, యాకోబు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పోలీస్ వెల్ఫేర్ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన పోలీస్ వెల్ఫేర్ షాపింగ్ కాంప్లెక్స్, పోలీస్ అవుట్ పోస్టును జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇక్కడ త్వరలోనే పోలీస్ అవుట్ పోస్టు సేవలను ప్రారంభిస్తామని విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎల్లప్పుడు రద్దీగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్మించామని తెలియజేశారు. భవన నిర్మాణానికి కషి చేసిన అధికారులు, సిబ్బందిని శాలువలు కప్పి జ్ఞాపికలను అందజేశారు. పోలీస్‌వెల్ఫేర్ షాపింగ్ కాంప్లెక్స్, పోలీస్ అవుట్ పోస్టు నిర్మాణానికి ప్రత్యేకశ్రద్ధ చూపిన ఆర్ఐ ఎంటిఓ మధుని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ఐబి శ్రీలక్ష్మి, అడిషనల్ ఎస్పీ ఏఆర్ జి.నాగేశ్వరరావు, పట్టణ డీఎఈస్పి శ్రీనివాసమూర్తి, దిశ డిఎస్పీ జె.బాబుప్రసాద్, ట్రాఫిక్ డిఎస్పీ విష్ణు రఘువీర్, ఏఆర్‌డి ఎస్పీ మురళీధర్, ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఈస్ట్ ఇన్స్పెక్టర్ గంగిరెడ్డి, టిడిసి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు, క్రైమ్ ఇన్స్పెక్టర్ భాస్కర్, కమాండ్ కంట్రోల్ ఇన్స్పెక్టర్ సురేంద్ర నాయుడు, ఆర్ఐ అడ్మిన్ నీలకంటేశ్వరరెడ్డి, ఆర్ఐఎంటిఓ మధు, రెండవ పట్టణ ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



మాల్‌లో ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి

ఎస్ఎస్‌సి మోడల్ పేపర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వివిధ విషయ నిపుణుల చేత రూపొందించిన 10వ తరగతి మోడల్ పేపర్లను చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్, డీఈవో విజయేంద్రరావు తన ఛాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్ పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని, వీటిని విరివిగా వాడుకులోకి తీసుకురావడానికి కృషి చేసిన యుటిఎఫ్ సభ్యులను ప్రశంసించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి.రమణ, జిల్లాఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.మణిగండన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దీనావతి, సీనియర్ నాయకులు జి.రాధాకష్ణ, జిల్లా కార్యదర్శులు రెడ్డప్ప నాయుడు, కష్ణమూర్తి, ఏకాంబరం, ఈశ్వర్, మహేంద్ర, సురేష్ కుమార్, పార్థసారథి, గణేష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, ఆడిట్ కన్వీనర్ పిసి.బాబు, కన్వీనర్ ఎంవి.రమణ, ఎంఎన్ శేఖర్, సారధి పాల్గొన్నారు.

గడపగడపలో కనుగొన్న సమస్యలకు పరిష్కారం

మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి- నగరి: జగనన్న పాలనలో సంక్షేమానికి అభివద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. నగరి మున్సిపాలిటీలో గడపగడపకు మన ప్రభుత్వం నిదులతో 2వ వార్డు కాకవేడులో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, 3వవార్డు ఎకెఎన్ లేఅవుట్‌లో రూ.15లక్షల వ్యయంతోను, 8వ వార్డు కీళపట్టు బీసీ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతోను నిర్మించే సిమెంట్ రోడ్డు పనులకు గురువారం ఆమె భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ గురువారం ఒక్కరోజులోనే నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు ప్రాంతాల్లో కోటిరూపాయల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలను ఆ పథకానికి సంబంధిత నిధులతో పరిష్కరించడం జరుగుతోందన్నారు. మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి, వైస్‌చైర్మన్లు వెంకటరత్నం, బాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, దేశమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, కౌన్సిలర్లు అణ్ణెమ్మ, మునికష్ణారెడ్డి, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, ఆనంద్‌కుమార్,మునివేలు, యాకోబు, శశికుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్రకృతి వ్యవసాయ పంటలను రాష్ట్ర, జిల్లా వ్యవసాయాధికారులు పరిశీలించారు. గురువారం వెదురుకుప్పం, పెనుమూరు మండలాల్లోని ప్రకృతి వ్యవసాయ పంటలను, రాష్ట్ర వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వాసు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. అనంతరం రైతులు సాగుచేస్తున్న పద్ధతులను గురించి అడిగి తెలుసుకున్నారు. పంటల వైవిధ్యం, అంతర్ పంటలు, ఏగ్రేడ్ డ్రాట్ ప్రూఫింగ్ మోడల్స్, ప్రస్తుత సీజన్‌లో వరి రైతులు కాలిబాటలు పెట్టుకోవడం, ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు వంటివి వాడకం గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పెట్టుబడి తగ్గించుకుని, ఆదాయం పెంచుకోవచ్చు అన్నారు. మామిడి వంటి ఉద్యానవన పంటల్లో నవధాన్యాలు చల్లి దున్నుకోవడం వలన 45రోజులు కలుపు తగ్గి భూమిలో కర్బన శాతం పెరుగుతుందని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది హనుమంతు, యూనిట్ ఇన్చార్జిలు ధనలక్ష్మి, లక్ష్మి, మురళి, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సోమల విద్యార్థి

ప్రజాశక్తి- సోమల: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.హేమనిధి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తుంగా నాగరాజ, పీడీ కరుణానిధిలు తెలిపారు. ఈనెల 10 నుండి 12వ తేదీ వరకు రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలు ఖాదరాబాద్ నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్, ఉమ్మడి కర్నూలు జిల్లానంద్యాలలో జరిగాయని తెలిపారు. అందులో జిల్లా స్కూలు గేమ్స్ ఆధ్వర్యంలో అండర్- 14 విభాగంలో త్రోబాల్ బాలబాలికల ఎంపిక పోటీలు జరుగగా చిత్తూరు జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించిందని తెలిపారు. బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలవడంలో సోమల విద్యార్థిని బి.హేమనిధి 9వ తరగతి, ప్రధాన భూమిక పోషించిందని, క్రీడాకారిణి చక్కటి ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయి సెలక్షన్ కమిటీ సభ్యులు వంశీకృష్ణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై రాష్ట్రజట్టుకు పాతినిధ్యం వహిస్తారని, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి త్రోబాల్ పోటీలలో పాల్గొంటారని పిడి కరుణానిధి తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.



ప్రశంసా పత్రాన్ని చూపుతున్న విద్యార్థిని హేమనిధి

పాడి రైతుల వెతలు తీరేనా...?

- పశువులకు అందని వైద్యం
- మందులు లేవంటూ ప్రైవేట్ షాపులకు పరుగులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం

గ్రామాల్లో పశువైద్యశాలలు, వైద్యులు ఉన్నప్పటికీ మందులు లేకపోవడంతో పశువులకు సరైన చికిత్స అందడం లేదు. దీంతో పాడిరైతులు ప్రైవేట్ మందుల షాపులకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని పశు వైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. మూగజీవాలకు జబ్బు చేసి చికిత్స కోసం వెళ్లినా అక్కడ మందులు లేకపోవడంతో చేసిదేమీ లేక పాడి రైతులు వెనుదిరుగుతున్నారు. తమ మూగజీవాల బాధను చూడలేక ప్రైవేట్ షాపులలో మందులుకొని పశువులకు అందిస్తున్నారు. పాడి రైతుల ఆవులకు జబ్బు చేస్తే ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్ళమని వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బంది సూచనలు ఇస్తున్నారు. సకాలంలో మూగజీవాలకు సరైన వైద్యం అందక బక్కచిక్కి చనిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అంతుచిక్కని వ్యాధులతో పాడి ఆవులు బాధపడుతుంటే.. రైతులు చూడలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతు కుటుంబాలు ఢీలాపడుతున్నాయి.

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో వెదురుకుప్పం, కార్వేటినగరం, పాలసముద్రం, శ్రీ రంగరాజపురం, పెనుమూరు ఆరు మండలాలు ఉన్నాయి. ఇందులో వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్ఆర్ పురం మూడు మండలాలకు కలిపి వెదురుకుప్ప మండల కేంద్రంలో ఏడి ఆఫీసును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ పశువైద్యాధికారిగా డాక్టర్ రూపను ప్రభుత్వం నియమించింది. ఈ మూడు మండలాలు ఆ అధికారి ఆధీనంలోనే ఉంటుంది. మండలంలోని అధికారికా లెక్కల ప్రకారం సుమారుగా పాడి ఆవులు 10,047, ఎద్దులు 219, గొర్రెలు 4700, మేకలు 5200, కోళ్లు 2500లు ఉన్నాయని అంచనా. మండలంలో పచ్చికాపల్లం, ఆర్కేయం పురం, తిరుమలయ్యపల్లి, ఆళ్ళమడుగు, పాతగుంట, జక్కదొన గ్రామాలలో పశు వైద్యశాలలో ఉన్నాయి. సుమారుగా గత పది నెలలుగా మందులు లేక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూగజీవాలకు జబ్బు చేసి ఆయా సెంటర్ దగ్గర ఉన్న రైతులు అక్కడి వైద్యశాలకు వెళితే మందులు స్టాకు లేవని చెప్పి సిటీ రాసి ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్లి తీసుకురండి అని అక్కడ ఉన్న సిబ్బంది చెబుతున్నారని పాడి రైతులు వాపోతున్నారు. ఒక్కో సమయంలో రైతు చేతిలో డబ్బులు లేక, మందులు కొనలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, జీవనాధారమైన పాడిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డిసెంబర్ నెలలో మూగజీవాలకు గాలికుంటు వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది. ఇంత వరకు జీవాలకు టీకాలు వేయలేదని జీవాలకు ఎప్పుడుఎటువంటి వ్యాధి వస్తుందో తెలీక క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్నామని గొర్రెలమేకల పెంపకం దారులు వాపోతున్నారు. గత కొన్ని రోజుల క్రితం ఓ పాడి రైతు ఆవుకు జబ్బు చేసి పశువైద్యశాలక తీసుకువస్తే మందులేవని చెప్పడంతో రైతు పైస్థాయి అధికారుల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లడంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. అధికంగా జబ్బులు వచ్చే శీతాకాలంలో పశువులకు టీకాలు, మందులు అందించపోవడం వలన పాడి రైతులు అధికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పాడి పశువులకు అవసరమైన మందులను పశువైద్యకేంద్రాలకు అందించాలని పాడి రైతులు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో మందులు లేకపోవడంతో పాడి ఆవుతో తిరిగివెళుతున్న రైతు


మందుల కొరత రాష్ట్రమంతా ఉంది

- రూప, ఏడీ వెదురుకుప్పం

పశువైద్యశాలల్లో మందుల కొరత కేవలం ఇక్కడ మాత్రమే కాదు. రాష్ట్రమంతటా ఉందని, మందులు వస్తాయి.. వచ్చినప్పుడు పశువులకు వైద్యం చేస్తాం.

కనీసం పిడుదుల మందు కూడా లేదు..


- బోడిరెడ్డి దేవదాసురెడ్డి, మొండివెంగనపల్లి



మండలంలోని పశువుల వైద్యశాలలో కనీసం పిడుదుల మందు కూడా లేదు. జబ్బుపడిన ఆవులను ఆసుపత్రి దాకా తీసుకువచ్చిన మందులు లేకపోవడంతో తిరిగివెళుతున్నాం. శీతాకాలంలో ఎక్కువగా పశువులు జబ్బుపడుతుంటాయి. ఇటువంటి పరిస్థితిలో పశువులకు మందులు ఇవ్వకపోవడం వలన పాడి రైతులు నష్టపోక తప్పదు.

ప్రజారోగ్యానికి పెద్దపీట: ఎంపీపీ

ప్రజాశక్తి - కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం మండలం నుంచి ఉచిత కంటి ఆఫరేషన్‌కు ఎంపికైన వారిని సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు కంటిచూపు ఎంతో అవసరమని గుర్తించి ఉచిత కంటిపరీక్షల నిర్వహించడమే కాకుండా వారికి ఉచితంగా కంటి ఆఫరేషన్, కంటి అద్దాలు అందించే కార్యక్రమాలకు కషి చేస్తుందన్నారు. పేదల కోసం ప్రభుత్వం ప్రారంభించి ఇంటింటా కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు చేపట్ట లేదన్నారు. వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం ప్రతి గ్రామంలోని ప్రతిరోజు జరుగుతుందన్నారు. కంటిపరీక్షలు నిర్వహించన వారిని ప్రభుత్వం చెన్నైలోని ప్రముఖ ఆస్పత్రులకు తరలించి ఎలాంటి కర్చులు లేకుండా వారికి కావాల్సిన సౌకర్యాలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అనంతరం కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పర్యవేక్షకులు తాగరాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి ప్రభుత్వం ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారి బస్సును ఎంపీపీ ప్రారంభించారు. ఉపసర్పంచ్ శేషాద్రి, లోకనాథ నాయుడు, మణి, ధనశేఖర్ వర్మ, వైద్యాధికారులు డాక్టర్ భాగ్యలక్ష్మి. డాక్టర్ శతీభాగ్యం, డాక్టర్ గోపినాథ్, డాక్టర్ భూవనేశ్వరి, డాక్టర్ హేమశ్రీ, ఆర్తమాలిక్ టెక్నిషన్ సుమలత, పలువురు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న ఎంపీపీ లతబాలాజీ

మారుసాని లోకనాథరెడ్డి సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి- కార్వేటినగరం: తపాల శాఖలో గ్రామీణ పోస్టుమాస్టర్‌గా లోకనాథరెడ్డి ఎనలేని సేవలు అందించారని తపాలా శాఖ పుత్తూరు డివిజన్ ఇన్స్పెక్టర్ నరసింహ ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా జరపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా తపాల శాఖలో ఎనలేని సేవలు అందించిన లోకనాథరెడ్డిని ఉద్యోగస్తులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో చిన్నపాటి లోపం లేకుండా పోస్టల్ డిపార్టుమెంట్ శాఖకు ఆదర్శంగా నిలిచారని, అదే క్రమశిక్షణలో ప్రతిఒక్కరూ మెలగాలన్నారు. పదవీవిరమణ అంనంతరం కూడా ఆయన సలహాలు, సూచనలు అవసరమన్నారు. అనంతరం ఎస్వి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పోస్టల్‌శాఖకు సంబంధించిన వివిధ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించి ఎన్నో డిపాజిట్లు చేయించారని, ఆయన అడుగు జాడలలో సిబ్బంది సహకరించి డిపాజిట్ల సేకరణను పెంచేందుకు కషి చేయాలన్నారు. అనంతరం సన్మానగ్రహీత లోకనాథరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఎలాంటి లోటు పాటులు లేకుండా పదవీ విరమణ చేస్తున్నానని. ఉద్యోగస్తులకు రాజకీయంగా ఎలాంటి సహాయ సహకరాలు కావాలన్నా తాను అందించడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటానని అన్నారు. అనంతరం లోకనాథరెడ్డి, దేవకీ దంపతులను తపాలాశాఖ సిబ్బంది శాలువలు కప్పి గజమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది హరినాథరెడ్డి, మురళీ మనోహరెడ్డి. వాణి, కిరణ్కుమారి, మధు, రాహుల్, గణపతి. కుప్పయ్య, గిరి, భాస్కర్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



లోకనాథరెడ్డి దంపతులను ఘనంగా సన్మానిస్తున్న తపాలా అధికారులు

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి

జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ప్రజాశక్తి- వికోట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని మండలంలో ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. గ్రామీణస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహిం చేందుకు యువతను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వం అందజేసిన స్పోర్ట్స్ కిట్లను సచివాల సిబ్బందికి అందజేశారు. వైస్‌ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, సర్పంచ్ దామోదర్, ఎంపీడీవో మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీలు



ప్రజాశక్తి- చౌడేపల్లి: జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి గురువారం స్థానిక మండల పరిపాలన భవనంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతప్తిని వ్యక్తం చేశారు. అనంతరం జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష పథకం, వైయస్సార్ గహ నిర్మాణ పథకం వంటి పథకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి వెలువడి అమలులో ఉన్న ప్రతిపథకం అర్హులైన లబ్ధిదారులకు చేరవేయాలని ఆదేశించారు. ఎంపీడీవో సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం'

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైఎస్.జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ రావాలని మండల ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం మండల పరిధిలోని కత్తెరపల్లి సచివాలయంలో ఏపీకీ జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ నవీన, మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి సామాజికవర్గం ఆర్థికంగా, సామాజికంగా అన్నివిధాల సమానంగా అభివద్ధి చెందాలనే లక్ష్యంతో అనేక సంక్షేమాలను జగనన్న అందిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం ఎంపీపీ లతబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్ రాజు చేతుల మీదుగా సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురందర్, సీనియర్ నాయకుడు పద్మనాభరెడ్డి, మాజీ సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, పద్మనాభశెట్టి, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాధరెడ్డి, అర్జునయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నదే'

బంగారుపాళ్యం: సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దక్కుతుందని సర్పంచ్ దీప్తిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మొగిలి వెంకటగిరి పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగినది. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జగన్మోహన్‌రెడ్డి మాట నిలుపుకున్నారని రాబోవు ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ఆదరించాలన్నారు. ఉప సర్పంచ్ కుమార్, బాలాజీ, మురళి, కృష్ణయ్య పాల్గొన్నారు.



'బాబుతోనే.. భవిష్యత్తు గ్యారెంటీ'

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బాబుతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివద్ధి చెందుతుందని, తెలుగుదేశం పూతలపట్టు నియోజకవర్గం ఇంచార్జ్ మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని వెలుతురుచేను పంచాయతీలో భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమం మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా మురళి మోహన్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో టిడిపి ఆదరించాలని కోరారు. నాయకులు వంశీ చౌదరి, రాధిక, విమల, రమేష్ పాల్గొన్నారు.



వెదురుకుప్పం: మండలంలోని మొండి వెంగనంపల్లి పంచాయతీ బండమీద ఇండ్లు గ్రామంలో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వివిఎం.థామస్ పర్యటించారు. స్థానిక మహిళలు గ్రామంలోని సమస్యలను ఆయన విన్నవించుకున్నారు. గురువారం మండలంలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో గెలుపొంది అధికారం చేపట్టిన వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తామని హామీ ఇచ్చారు. క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోహన్‌మురళీ, గంటావారిపల్లి మాజీ సర్పంచ్ రాజారెడ్డి, గంగయ్య శేషాద్రి, కంచి ఆనందరెడ్డి, మునిచంద్ర పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కోకా ప్రకాష్ నాయుడు అన్నారు.గురువారం గంగాధరనెల్లూరులో టిడిపి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల శంఖారావం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోకా ప్రకాష్ నాయుడు, చిత్తూరు పార్లమెంట్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ధనంజయ యాదవ్ మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు వంటి స్థానిక సంస్థలను పటిష్టం చేయాల్సిందిపోయి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాల్లో కనీస అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, చిన్నపాటి రోడ్ల నిర్మాణాన్ని సర్పంచుల ఆధ్వర్యంలో అభివద్ధి కార్యక్రమాలు చేసుకునే వారిని అయితే వైసిపి పాలనలో కేంద్రం ఇచ్చిన నిధులను సైతం పక్కదారి పట్టించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని రానున్న శాసనసభ ఎన్నికల్లో తరిమికొట్టడానికి సర్పంచులు, మాజీ సర్పంచులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి కష్ణం నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, శ్రీధర్ యాదవ్, దేవ సుందరం, నియాజ్ అలీ, జ్యోతియాదవ్, అరుణ, రుద్రయ్య నాయుడు, చంగల్రాయ యాదవ్, కోదండరెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు: నిరుద్యోగ యువతకు అనేక హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేడు అదే యువత భవిష్యత్తును గాలికి వదిలేసిన ఘనత వారి ప్రభుత్వానికి దక్కుతుందని పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు రెడ్డప్ప నాయుడు విమర్శించారు. అధికారంలోకి వచ్చి నేటికీ నాలుగున్నర సంవత్సరాలు అవుతున్న ఏఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా యువతకు మోసం చేస్తున్నారని ఓ ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి వచ్చిన ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నేటికీ దాని ఊసేలేదు అన్నారు. ఇంతవరకు ఒక డీఎస్సీ నోటిఫికేషన్‌గాని, ఒక్క పోలీసు రిక్రూట్మెంట్ గాని జరపలేదంటూ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న 2 లక్షల 70 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి నేడు దాని జాడే లేదని విమర్శించారు. రాష్ట్రంలో యువత పక్క రాష్ట్రాలకు వెళ్లి చాలీచాలని జీతాలతో పనిచేయాల్సి దుస్థితి ఏర్పడిందన్నారు. దీనిని తెలుగు యువత ఖండిస్తూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత కోసం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ బంగ్లా సమీపంలోని చెన్నపట్నం చెరువు మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో శ్రీనివాసులు(36) అనే యువకుడు మృతి చెందగా ప్రవీణ్, శ్రీనివాసులుకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరు పుంగనూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పెద్దపంజాణి మండలం పెద్దకాప్పల్లె పంచాయతీ తిప్పిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు, పేటూరు పంచాయతీ ఇర్లపల్లెకు చెందిన ప్రవీణ్, నిమ్మనపల్లి మండలానికి చెందిన శ్రీనివాసులు ముగ్గురు ద్విచక్ర వాహనంలో చౌడేపల్లి మండలం రామయ్యగట్టు గ్రామంలో జరిగే వివాహ వేడుకలకు హాజరైనందుకు గురువారం ఉదయం సోమల నుండి ఇరికిపెంట మీదుగా చౌడేపల్లికి వెళుతుండగా బంగ్లా సమీపంలోని చెన్నపట్నం చెరువు మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పెద్ద గుండ్లకు ఢీకొట్టడంతో పెద్దపంజాణి మండలానికి చెందిన వెంకటస్వామి కుమారుడు శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడని మిగిలిన ఇరువురు తీవ్రగాయాలు కావడంతో పుంగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగునూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సోమల మండలం నెల్లిమంద పంచాయతీ నవాబుపేటకు చెందిన షేక్ సయ్యద్ బాషా(19) ద్విచక్ర వాహనంలో వెళుతూ అదుపుతప్పి క్రింద పడటంతో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంబంధించి మృతుడి తండ్రి భాషా లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు. ఈనెల 10వ తేదీ కందూరు నుండి నవాబుపేటకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి సయ్యద్ బాషా క్రిందపడి తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం తిరుపతి రమాదేవి హాస్పిటల్లో చేర్పించి చికిత్స అందిస్తుండగా 13వ తేదీ బుధవారం మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాలు తెలియజేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వస్తువులు దగ్ధం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం దళితవాడలో కరెంట్ షాక్‌తో ఓ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. గురువారం తూగుండ్రం దళితవాడకు చెందిన జయరామ్ ఇంట్లోని వస్తువులు విద్యుదాఘాతంతో మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులన్నీ ఖాళీ బూడిదయ్యాయి. సుమారు 2 లక్షల రూపాయల నష్టపోయామని జయరామ్ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ శ్రీబాబు, వీఆర్వో శిరీష సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి తహశీల్దారుకు సమాచారాన్ని తెలియజేశారు.

జాతీయ ఇంధన పొదుపు దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- సోమల: జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం సందర్భంగా గురువారం మండల విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నంజంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఇంధన పొదుపు వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల విద్యుత్ శాఖ ఏఈ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ వినియోగం, విద్యుత్తు తయారీ విధానం, ఆదా చేసుకోవడం వంటి వాటి వలన కలిగే లాభాలపై విద్యార్థులకు, గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



ప్రజాశక్తి- సోమల: రాష్ట్రంలోని పేదప్రజల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, సంక్షేమ పథకాలు పేదలకు అందేలా అర్హులైన వారికి చేరేలా చూడాలని ఎంపీడీవో నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని వలిగట్ల కామిరెడ్డివారిపల్లి పంచాయతీలలో వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 17 సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుధాకర్, ఉపాధి హామీ ఏపీవో దినకర్, ఎంపీటీసీ కళ్యాణి, కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి- కార్వేటినగరం: విద్యార్థి దశ నుంచే ఎయిడ్స్‌పై అవగాహన కలిగించాలని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం డైట్ కళాశాలలో రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన పాఠశాల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హెచ్‌ఐవి (ఎయిడ్స్), లైంగికవ్యాధులు వంటి వాటిపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందనానరు. కౌమార దశలో సరైన ప్రవర్త, జీవన నైపుణ్యాలు పెరిగే విధంగా విద్యాబోధనలు అందించాలని సూచించారు. అలాగే రీసోర్సు పర్సన్స్ డైట్ అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్, చెంగల్రాజులు వివిధ అంశాలపై శిక్షణ కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులచే ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు, డైట్ అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.